ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మహబూబాబాద్

శనివారం 20 జూలై 2024

5



మానుకోటలోని రామమందిరం ఎదుట రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

విస్తారంగా వాన


- బుద్దారంలో వర్షానికి కూలిన ఇల్లు
- మానుకోట పట్టణంలో రోడ్లు జలమయం

జిల్లాలో సగటున 8.6మి.మీ వర్షపాతం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 19 : జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. కొత్త గూడ, మహబూబాబాద్ మండలాల్లో శుక్రవారం మధ్యాహ్నం వానదంచికొట్టింది. జిల్లాలో సగటున 8.6 మిల్లీమీటర్ల వర్షపాతం పడింది. మానుకోటలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. గూడూరు, గార్ల, బయ్యారం, నెల్లికుదురు, చిన్నగూడూరు, మరిపెడల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. అలాగే గురువారం రాత్రి గంగారం, మహబూబాబాద్, కొత్తగూడ, గార్ల, గూడూరు, మరిపెడ, తొర్రూరు మండలాల్లో మోస్తారు వాన పడగా మిగతా మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. గార్ల మండలంలోని బుద్దారంలో వెంకటేష్‌కు చెందిన ఇల్లు పాక్షికంగా కూలింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు కొత్తగూడలో 12.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గంగారం 19.2మి.మీ, బయ్యారం 6.8మి.మీ, గార్ల 12.4మి.మీ, డోర్నకల్ 6.2మి.మీ, కురవి 0.6మి.మీ, మహబూబాబాద్‌లో 8.2మి.మీ, గూడూరులో 11.0మి.మీ వాన పడింది. కేసముద్రం 5.4 మి.మీ, నెల్లికుదురు 8.2 మి.మీ, నర్సింహులపేట 7.0మి.మీ, చిన్నగూడూరు 6.4 మి.మీ, మరిపెడ 10.2 మి.మీ, దంతాలపల్లి 5.8 మి.మీ, తొర్రూరు 14.2మి.మీ, పెద్దవంగర 3.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, వెరసి 137.4 మిల్లీమీటర్ల వర్షపాతం పడింది.



బుద్దారంలో వర్షానికి కూలిన ఇల్లు



బయ్యారంలోని ఆయిల్‌పామ్ పంట

ఆయిల్ పామ్‌పై ఆసక్తి..

- ఏడు వేల ఎకరాల్లో రైతుల పంట
- నాలుగేళ్లలో 24 రెట్లు పెరిగిన విస్తీర్ణం
- అన్నదాతలకు రూ.50,918 రాయితీ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం

జిల్లాలో ఏటేటా పెరుగుతోన్న సాగు

బయ్యారం, జూలై 19 : జిల్లాలో ఏటేటా ఆయిల్‌పామ్ సాగు పెరుగుతోంది. ఈ పంట లాభసాటిగా ఉండటంతో రైతులు ఆసక్తి కనరుస్తున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఇస్తున్న ప్రోత్సాహం, పామా యిల్ పంటకు ఎక్కువ మద్దతు ధర లభిస్తోండటంతో అన్నదాతలు సాగుపై దృష్టిని సారిస్తున్నారు.

జామాయిల్, సుబాబుల్ ధరల్లో హెచ్చుతగ్గులు నెల కొనడం.. ఐటీసీ, బీపీఎల్‌తో పాటు ఇతర పేపర్ మిల్లు కర్మాగారాలు జామాయిల్, సుబాబుల్ కొనుగోళ్లలో తీవ్ర ఆంక్షలు పెట్టడం, దళారుల బెడద అధికంగా ఉండటంతో రైతులు ఆయిల్‌పామ్ సాగుపై కర్షకులు మక్కువ కనబరుస్తున్నారు. ఈ ప్రాంత వ్యవసాయ భూములు, వాతావరణం కూడా ఆయిల్‌పామ్ సాగుకు బాగా అనుకూలమని రైతులు అభిప్రాయపడుతున్నారు. దీనికితోడు ప్రభుత్వాలు మొక్కల సరఫరా, సబ్సిడీలు, డ్రిప్ లాంటి సదుపాయాలతో పాటు మార్కెటింగ్ సౌలభ్యం కూడా కలిపిస్తోండటంతో రైతులు ఆయిల్ పావ్ సాగుకు మొగ్గ చూపుతున్నారు.

నాలుగేళ్లలో భారీగా పెరిగిన విస్తీర్ణం..

మహబూబాబాద్ జిల్లాలో 2020-21లో లో ప్రారంభమైన ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం గడిచినా ఈ నాలుగేళ్లలో క్రమంగా పెరుగుతోంది. సంబంధిత అధికారిక లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా డోర్నకల్, మహబూబాబాద్, పాలకుర్తి, ఇల్లందు, ములుగు నియోజకవర్గాల పరిధిలోని 15 మండలాల్లో రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నారు. 2020-21 ఏడాది 48 మంది రైతులు 278 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయడం ప్రారంభించారు. 2023-24 నాటికి మొత్తం 1,640 మంది రైతులు 6,855 ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ను సాగు చేస్తున్నారు. ఈ నాలుగు సంవత్సరాలు సాగు విస్తీర్ణం దాదాపు 24 రెట్లు పెరిగింది. ఇందులో అధికంగా కురవి మండలంలో 237 మంది రైతులు 1,099 ఎకరాల్లో.. అత్యల్పంగా కొత్తగూడ మండలంలో 09 మంది రైతులు 32 ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ను రైతులు సాగు చేస్తున్నారు. కాగా, గడిచిన రెండేళ్ల కాలంలో తొర్రూరు మండలంలో రైతులు ఆయిల్‌పామ్ సాగు పట్ల ఎక్కువ మంది రైతుల మక్కువ చూపుతున్నారు. ఒక్క గంగారం మండలంలోనే రైతులు ఇంకా ఆయిల్‌పామ్ సాగు వైపు దృష్టి సారించనట్లు చూపనట్లు తెలుస్తుంది.

ఎకరాకు రూ.50 వేలు రాయితీ..

రైతులను ప్రోత్సహించేందకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ పంట సాగుకు దఫాల వారిగా పలురకాల రాయితీలు అం దిస్తుంది. ఎకరా విస్తీర్ణంలో నాటే 57 మొక్కలకు గాను రాయితీ రూపంలో రూ.11,600 చెల్లిస్తుంది. ఇకపోతే ఎరువులు, అంతర పంటలకు గాను ఏడాది రూ. 4200 చొప్పున నాలుగేళ్లలో మొత్తం రూ.16,800 రాయితీ కల్పిస్తుంది. బిందు సేద్యంకు ఇచ్చే రూ. 22,518 రాయితీ కలుపుకొని ఎకరాకు నాలుగేళ్లలో మొత్తం రూ.50,918 రాయితీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందజేస్తున్నాయి.

మండలాల వారిగా సాగు విస్తీర్ణం. (ఎకరాల్లో)

మండలం	రైతులు	సాగు విస్తీర్ణం
కురవి	237	1099
నర్సింహులపేట	125	574
మరిపెడ	124	537
దంతాలపల్లి	107	487
డోర్నకల్	109	475
చిన్నగూడూరు	72	356
మహబూబాబాద్	186	608
నెల్లికుదురు	152	599
కేసముద్రం	109	392
గూడూరు	83	250
తొర్రూరు	208	982
పెద్దవంగర	38	168
గార్ల	48	194
బయ్యారం	33	103
కొత్తగూడ	09	32
మొత్తం	1640	6855

లాభసాటిగా ఆయిల్ పామ్ సాగు

- నామ బాబురావు, రైతు బయ్యారం



ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ సాగు లాభసాటే అనిపిస్తుంది. నేను 3 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నాను. అంతకుముందు పత్తి, మిర్చి పండించే వాడిని. కూలీల కొరత, దిగుబడి, మద్దతు ధర సమస్యతో నష్టం వాటిల్లేది. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం కూడా ప్రోత్సాహం కల్పిస్తోండటంతో పంట సాగు లాభసాటిగా మారే అవకాశముంది. పైగా కష్టం కూడా తక్కువే.

పంట మార్పిడి చేయాలి..

మరియన్న, జిల్లా ఉద్యానశాఖ అధికారి



మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టు ఎప్పటికప్పుడు పంట మార్పిడితో సాగు చేస్తే రైతులకు లాభదాయకం. ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్ పామ్‌కు మంచి డిమాండ్ ఉన్నది. ఈ పంట సాగు చేయటం వల్ల ఎలాంటి కీచకాలు, చీడపీడల సమస్య ఉండదు. కూలీల కొరతను కూడా అధికమించవచ్చు. ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేలు రాయితీ కల్పిస్తుంది. అంతర్ పంటలతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చు.





మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

- జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణి



మత్స్యశాఖ కార్యాలయంలో సభ్యత్వ కార్డులను అందజేస్తున్న నాగమణి

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 19 : జిల్లాలోని మత్స్యకారులంతా ఆర్థికంగా ఎదగాలని, అందుకు తగిన సహాయ సహకారాలు అందించేందుకు మత్స్యశాఖ ఎప్పుడు సిద్ధంగా3 ఉంటుందని జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణి అన్నారు. శుక్రవారం మహబూబాబాద్‌లోని మత్స్యశాఖ కార్యాలయంలో మత్స్యపారిశ్రామిక సొసైటీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న చెరువులు, కుంటలు ఆక్రమణకు గురికాకుండా పర్యవేక్షిస్తూ చేపలు పట్టుకునేందుకు మత్స్యకారులకు సబ్సిడీతో కూడిన రుణాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మత్స్యకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సంఘం అధ్యక్షుడు సింగం అశోక్, సొసైటీ కార్యదర్శి పిల్లి దశరథ, డైరెక్టర్ డోలి ఉపేందర్, భూముల శ్రీరాములు, తోట యాదగిరి, కోళ్ల రవి, దేశబోయిన అనిల్ పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

జిల్లా విద్యాశాఖాధికారి రామారావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 19 : గెలుపోటములను సమానంగా స్వీకరించాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మహిళా సాధికారత, జనాభా పెరుగుదల, ఆరోగ్యకరమైన జీవన శైలిని పోత్సహించటం తదితర అంశాలపై తయారు చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే వివిధ కళానైపుణ్యరంగాల్లో రాణించే విధంగా సంసిద్ధులు కావాలన్నారు. ఈ పోటీల్లో మానుకోట బాలికోన్నత పాఠశాల విద్యార్థిని నందిని ప్రథమ, కేసముద్రం ఉన్నత పాఠశాల విద్యార్థి పవన్‌సాయి ద్వితీయ, మానుకోట బాలికోన్నత పాఠశాల విద్యార్థినీ సీహెచ్.లక్ష్మీప్రసన్న ద్వితీయ స్థానాల్లో నిలవగా వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు చంద్రశేఖర్ ఆజాద్, సుధాకర్, హెచ్‌ఎం సిరినాయక్, సీఆర్పీ ఉప్పలయ్య పాల్గొన్నారు.

టెన్త్‌లో నూరుశాతం ఫలితాలు సాధించాలి..

బయ్యారం : వచ్చే పది వార్షిక పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని డీఈవో రామారావు ఉపాధ్యాయులను ఆదేశించారు. కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనుతనిఖీ చేశారు. ప్రార్థన సమయానికి పాఠశాలకు చేరుకొని ప్రార్థనలో పాల్గొన్నారు. ప్రార్థనలో కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం సబ్జెక్ట్ వారీగా ఉపాధ్యాయులతో మాట్లాడి బోధనాంశాలపై సూచనలు చేశారు. పాఠశాలలోని రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం పక్కనే గల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో విద్యా ప్రమాణాల గురించి చర్చించారు.



మహబూబాబాద్‌లో జిల్లా స్థాయి పోస్టర్ తయారీ పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రామారావు

పాఠశాల తనిఖీ..

నెల్లికుదురు : ఆలేరు జడ్పీఎస్ఎస్ పాఠశాలను డీఈవో రామారావు తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్యను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సెస్సీ పరీక్షలకు ఇప్పటి నుంచేప్రణాళికలు తయారు చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం రాందాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రార్థనలో కళ్లు తిరిగిన విద్యార్థిని..

కొత్తపేట స్కూల్లో జరిగిన ప్రార్థనలో 8వ తరగతి విద్యార్థిని ఈసం సంధ్య కళ్లు తిరిగి పడిపోవడంతో కంగారుపడ్డారు. అనంతరం డీఈవో చొరవ తీసుకొని దగ్గర్లోని పీహెచ్‌సీకి వెళ్లి తన కారులో ఇరువురు నర్సులను తీసుకొచ్చి విద్యార్థినికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉదయం ఏమి తినకపోవడంతోనే విద్యార్థిని కళ్లు తిరిగినట్లు తెలవడంతో ఊపిరి పీల్చుకున్నారు. హైస్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, పీఎస్ హెచ్‌ఎం రాజాతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న భూక్య మురళీనాయక్

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 19 : విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. జిల్లా సెంటర్‌లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తామన్నారు. విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్యకార్డుపై అన్ని ఆస్పత్రుల్లోను ఉచితంగా వైద్య సౌకర్యం పొందేలా చేయడం కోసం కృషి చేస్తానన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

సంఘం జిల్లా అధ్యక్షుడు షైన నాగయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్, రాఉపాధ్యక్షుడు పీఆర్.మోహన్, రాష్ట్ర కార్యదర్శి టీప్రభాకర్, నాయకులుసోమయ్య, గోపాల్‌రెడ్డి, కిష్టయ్య, వెంకటరెడ్డి, సోమయ్య, వెంకటయ్య, మోహన్‌రావు, మంగపతిరావు, నారాయణ, రాజలింగం, కృష్ణమూర్తి, సోమనర్సయ్య, రాములు, విజయకుమారి, చంద్రయ్య, వెంకట్రాంనర్సయ్య, విశ్వనాథచారి, షైన శ్రీనివాసులు, జమాల్‌ఖాన్, నాగేందర్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరచారి, సోమిరెడ్డి, వెంకటాద్రి, సత్యనారాయణ, హనుమంతప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి'



డోర్నకల్ తహసీల్దార్ కృష్ణవేణికి వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్‌లు

డోర్నకల్, జూలై 19 : ముదిరాజ్‌లు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, ముదిరాజ్ కులస్తులను బీసీ (డీ) నుంచి బీసీ (ఏ)లోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. డోర్నకల్‌లో మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ముదిరాజులను బీసీ (డి) నుంచి బీసీ (ఏ)లోకి మార్చుతామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. నీలం కృష్ణ, మునిసిపల్ కోఆప్షన్ సభ్యులు మారబోయిన రాంభద్రం, రెడ్డబోయిన శంకర్, ఆంజనేయులు, పగడాల వీరన్న, నిమ్మల కోటేశ్వర్‌రావు, బాబు, కృష్ణమూర్తి, సురేష్, రామ్మూర్తి, శ్రీనివాస్, మహేష్ శ్రీనివాస్, నవీన్, వీరన్న, రేవంత్, ఉపేందర్, జగ్గయ్య, వినయ్, వెంకన్న, సంతోష్, రాజు, సైదులు, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

- మరిపెడ : ముదిరాజ్ కులస్తులను బీసీ ఏలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ముదిరాజ్ కులస్తులు తహసీల్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు ముందు మరిపెడ మునిసిపల్ ప్రధాన రహదారులపై ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ సైదులుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిల్ల సహదేవ్ మాట్లాడారు. ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి పిట్టల ధనంజయ, మరిపెడ మండల అధ్యక్షుడు బయ్య ఉపేందర్, మారబోయిన వెంకటేశ్వర్లు, బత్తెం లక్ష్మయ్య, దుండి వీరన్న, గంగరబోయిన రమేశ్, కొప్పెర శ్రీను, వీరస్వామి, ఉపేందర్, వెంకన్న, మల్లేశ్, బాబు పాల్గొన్నారు.



బొగత.. జలసవ్వడుల పులకరింత..

తెలంగాణ నయాగరాగా పేరొందిన ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు, మూడు రోజులుగా తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు వస్తున్న వరదలతో బొగత ఉప్పొంగుతోంది. జలపాతం ముందరి భాగంలోని ట్రీహౌజ్ వరకు వరద నీరు చేరగా.. అల్లంత ఎత్తునుంచి దుంకుతున్న జలధారలను చూసి సందర్శకులు పులకరిస్తున్నారు. సెల్ఫీలు దిగుతూ, జలపాతం అందాలను కెమరాలలో బందిస్తూ మురిసిపోతున్నారు.

- వాజేడు

'ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి'

తొర్రూరు, జూలై 19 : టీజీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల కోసం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ పద్మావతి సూచించారు. శుక్రవారం తొర్రూరు బస్టాండ్‌లో గత 15 రోజులుగా వివిధ రూట్‌లలో డీలక్స్ బస్సుల్లో చార్జీలు చెల్లించి ప్రయాణించిన మహిళలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళల కోసం ప్రతీ 15 రోజులకు ఒకసారి ప్రయాణించిన వారు టికెట్‌పై వివరాలు రాసి లక్కీడ్రా బాక్సులో వేస్తే డ్రా తీసి మొదటి ముగ్గురు మహిళలకు బహుమతులు అందిస్తామన్నారు. గత 15 రోజులుగా డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళల టికెట్‌లను డ్రాతీసి బహుమతులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ రజిత, ఆర్టీసీ అధికారులు, యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రయాణికులకు బహుమతులు అందిస్తున్న డీఎం పద్మావతి

నేడు బీజేపీ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం

హాజరుకానున్న ఆదిలాబాద్ ఎంపీ నగేష్

గార్ల జూలై 19 : మండల కేంద్రంలోని ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం బీజేపీ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ యువజన మోర్చా రాష్ట్రకార్యదర్శి రావూక విమల్‌కుమార్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఆదిలాబాద్ ఎంపీ గూడెం నగేష్, జిల్లా పార్టీ అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు పాల్గొటారని వెల్లడించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు, బుత్ కమిటీఅధ్యక్షులు, ప్రజాసంఘాల బాధ్యులు, ముఖ్యకార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.



బదిలీలు రద్దు చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతి పత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

బల్దియా కార్మికులకు బదిలీల గండం

75ఏళ్లలో ఎప్పుడూ చేయలేదని ఆవేదన

నేడు సీఎంను కలువనున్న యూనియన్ నాయకులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 19: బల్దియా పారిశుధ్య కార్మికులకు బదిలీల టెన్షన్ పట్టుకుంది. గురువారం 445 మంది కిందిస్థాయి ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో చాలామంది అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా, మరికొందరు ఏకంగా అంబులెన్స్‌లలో కౌన్సెలింగ్‌కు వచ్చిన పరిస్థితి ఉంది. ప్రధానంగా 30 కేటగిరీలలో పనిచేస్తున్న 445 మంది ఉద్యోగుల్లో ఎక్కువగా దళిత సామాజిక వర్గానికి చెందిన వారు ఉండడంతో ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే 75 యేళ్ల వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ చరిత్రలో నాలుగోతరగతి ఉద్యోగులకు ఎన్నడూ బదిలీలు జరగలేదని అంటున్నారు.

నేడు చలో హైదరాబాద్

గ్రేటర్ వరంగల్ పరిధిలో ఎన్నడూ లేని విధంగా నాలుగో తరగతి ఉద్యోగులను బదిలీ చేయడం సరైంది కాదని తెలంగాణ మునిసిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు ఇటీవల కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియంశ్రీహరిని కలిసి సమస్యలు వెల్లడించారు. వారు సైతం సానుకూలంగా స్పందించినా బదిలీల తంతు ఆగడం లేదు. దీంతో శనివారం ఉద్యోగ సంఘాలు, ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు హైదరాబాద్‌కు వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలువనున్నట్టు తెలిపారు. అంతేకాకుండా బదిలీల తీరుపై హైకోర్టును ఆశ్రయించి బదిలీల రద్దుకు పోరాటం చేస్తామని సంఘం నాయకులు బొట్ల బిక్షపతి మాదిగ, ధర్మరాజులు తెలిపారు.

విద్యుత్‌తో జాగ్రత్త



వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఈలు మధుసూదన్‌రావు, వెంకటరమణ

హనుమకొండ టౌన్, జూలై 19: విద్యుత్ ప్రమాదాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ నాణ్యమైన విద్యుత్ పరికరాలను వినియోగించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని వరంగల్, హనుమకొండ ఎస్ఈలు మధుసూదన్‌రావు, వెంకటరమణ సూచించారు. గ్రామాల్లోని వినియోగదారులు తమ పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేసే లైన్‌మెన్, సీనియర్ లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, ఏఈల సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రమాదాల నుంచి బయటపడాలంటే కింది జాగ్రత్తలను పాటించాలని వినియోగదారులకు సూచించారు.

- వ్యవసాయం నిమిత్తం రైతులు పంపుసెట్లను వినియోగిస్తున్నప్పుడు కరెంట్ మోటార్లు కానీ, పైపులు కానీ, ఫుట్‌వాల్వులను అశ్రద్ధతో తాకొద్దు. ఆ సమయాల్లో విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదం సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- వర్షాలు కురిసినప్పుడు విద్యుత్‌స్తంభాలను, తెగిపడిన తీగలను, స్టార్టర్లను, మోటార్లను తాకొద్దు. వేలాడుతున్న కరెంట్ తీగల గురించి మీకు దగ్గర్లోని కరెంట్ ఆఫీస్, సంబంధిత అధికారులకు తెలియజేయాలి.
- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు మార్చడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- సర్వీస్ వైర్లను వీధి దీపాలను సరిచేసేందుకు ఇతరులు విద్యుత్ స్తంభాలను ఎక్కొద్దు. విద్యుత్ సిబ్బంది సహాయం తప్పనిసరిగా తీసుకోవాలి.
- ఇంటి వరండాలో మరియు ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్ దగ్గరలో (జీఐ) వైరును దండెముగా కట్టి తడిబట్టలను ఆరవేయడం ప్రమాదకరం. ఎవరికైనా కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గరగా ఉన్న వ్యక్తులు షాక్ గురైన వ్యక్తులను రక్షించాలన్న ఆతృతతో ప్రమాదం సంభవించిన వ్యక్తిని ముట్టుకోరాదు. షాక్‌కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్ ప్రవహించని వస్తువులను వాడటమే సరైన పరిష్కారం.
- చేపల వేటకు విద్యుత్ తీగలను అమర్చి చేపలను పట్టడం వలన షాక్‌కు గురై చనిపోతున్నారు. చేపలు పట్టడానికి విద్యుత్ తీగలు వాడరాదు.
- బోరు వేస్తున్నప్పుడు విద్యుత్ వైర్లు తాకి కొంతమంది చనిపోతున్నారు. బోర్లు వేస్తున్నప్పుడు పైన విద్యుత్ వైర్లు ఉన్నాయా లేదా అని ఒక సారి చూసుకొని జాగ్రత్తగా బోర్లు వేసుకోవాలి.
- జెండాలు ఎగుర వేస్తున్నప్పుడు జెండా పైపులు పైన విద్యుత్ వైర్‌కు తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వరికోతల సమయంలో హార్వెస్టర్స్‌కు విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి. తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడటంతో షాక్‌కు గురై చనిపోతున్నారు. చార్జింగ్ బంద్ చేసి మాట్లాడాలి.
- జంతువుల నుంచి పంట రక్షణ కోసం విద్యుత్ ఫెన్సింగ్ వేస్తున్నారు. ఇది చట్ట రిత్యా నేరం. విద్యుత్ కంచెలు వేయరాదు.

కాళోజీ కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలి..

ప్రొఫెసర్ కంచ ఐలయ్య



సదస్సులో అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య

కాళోజీ జంక్షన్, జూలై 19: హనుమకొండ బాలసముద్రంలోని కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలని అక్కడే గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ కంచ ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హరిత కాకతీయ హోటల్‌లో 'తెలంగాణ ఉద్యమం - గద్దర్ పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సదస్సుకు డీఎంఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ అధ్యక్షత వహించారు. కళాక్షేత్రం ప్రారంభం కాకముందే పేరు పెట్టడం సరైంది కాదని ఆయన అన్నారు. గద్దర్ అంటే కేవలం ఒక ప్రాంతానికి, వర్గానికి చెందిన వ్యక్తి కాదని, ఆయన అందరి మనిషి అని ఐలయ్య అన్నారు. కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టకుంటే, విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వకపోతే ఉద్యమాలు చేసి సాధించుకుంటామని హెచ్చరించారు.

కేంద్ర సాహిత్య యువ పురస్కార్ అవార్డు గ్రహీత పసునూరి రవీందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ విషయంపై పట్టించుకోకుంటే పోరాడి సాధించుకుంటామని తెలిపారు. సమావేశంలో ఇంకా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్, టీజీవీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మేడ రంజిత్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ కాడపాక రాజేందర్, పలు విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు హాజరై మాట్లాడారు.

రేపు నేత్ర, అవయవ, శరీరదాన ఐక్య వేదిక సమావేశం

కాళోజీ జంక్షన్, జూలై 19: నేత్ర, అవయవ, శరీరదాన రాష్ట్ర ఐక్య వేదిక సమావేశం ఆదివారం హనుమకొండలోని గోపాల్‌పూర్ జంక్షన్ సమీపంలోని అభి నిలయంలో నిర్వహిస్తున్నట్లు ఐక్య వేదిక వరంగల్ జిల్లా డైరెక్టర్ కొన్‌రెడ్డి మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ గంజి ఈశ్వరలింగం, కో కన్వీనర్ రాంకల్యాణ్, ప్రముఖ డాక్టర్ దాసరి ప్రసాదరావు, పలు సేవా కార్యక్రమాల ప్రతినిధులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నేత్ర, అవయవ, శరీరదాన ప్రాముఖ్యతను, భావజాలాన్ని వ్యాప్తి చేయడం సమావేశ ఉద్దేశమని మల్లారెడ్డి వివరించారు. స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు. సమావేశ వివరాల కోసం సెల్ నంబర్లు: 87905 48706 / 97037 38699 లను సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో లారీ డ్రైవర్ ఆత్మహత్య



మర్కండి వేణు (ఫైల్)

మట్టెవాడ, జూలై 19: ఆర్థిక ఇబ్బందులు తాళలేక లారీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన హంటర్ రోడ్‌లోని ఎన్టీఆర్‌నగర్‌లో జరిగింది. మట్టెవాడ సీఐ తుమ్మ గోపి కథనం ప్రకారం. నగరంలోని హంటర్‌రోడ్ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మర్కండి వేణు (54) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. విషయాన్ని గమనించిన స్థానికులు పని నిమిత్తం బయటికి వెళ్లిన వేణు భార్య స్వరూపకు సమాచారం అందించారు. ఆమె వచ్చిన వెంటనే ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వేణుకు భార్య స్వరూప, కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

దామెర, జూలై 19 : దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామం వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లికి చెందిన బిల్లా సురేందర్ రెడ్డి, బిల్లా దివ్యలు ద్విచక్రవాహనంపై హనుమకొండ కు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒగ్లాపూర్ స్టేజి వద్ద ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ప్రమాదవ శాత్తు కిందపడిపోయారు. దీంతో తీవ్రగాయాలైన క్షతగాత్రులను 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

చదరంగ వీరులు

- చెస్‌లో రాణిస్తున్న ఓరుగల్లు అణిముత్యాలు
- అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న అర్జున్, రాజారిత్విక్, సరయు



నేడు అంతర్జాతీయ చదరంగ దినోత్సవం

వరంగల్ స్పోర్ట్స్, జూలై 19: చదరంగం అంటేనే ప్రత్యర్థి కదలికను గమనిస్తూ ఎత్తుకు పైఎత్తు వేస్తూ వ్యూహాత్మకంగా ఆలోచిస్తూ చిత్తు చేయడం. అంతేకాకుండా ప్రత్యర్థి ఆలోచనల్ని విభిన్న కోణాల నుంచి పసికడుతూ విజయం వైపు దూసుకెళ్లాల్సి ఉంటుంది. మైండ్‌గేమ్‌గా ప్రాచుర్యం పొందిన చెస్‌లో రాణించాలంటే చిన్నతనం నుంచి ఆట పట్ల ఆసక్తి, ఏకగ్రాత, క్రమశిక్షణ, నిబద్ధత తప్పనిసరిగా ఉంటేనే సాధ్యమవుతుంది. 1966 జూలై 20న యునెస్కో ఆలోచన మేరకు ఫిడే ఆదేశాలతో తొలిసారిగా అంతర్జాతీయ చదరంగం (చెస్) దినోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. దీంతో యేటా భారతదేశంతో పాటు ప్రపంచ దేశాలలో చదరంగ దినోత్సవ వేడుకలు అంగరంగా వైభవంగా నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఈ మేరకు శనివారం అంతర్జాతీయ చదరంగం (చెస్) దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పలువురు చెస్ దిగ్గజాలు, గ్రాండ్ మాస్టర్లు, (జీఎం)లు ఉత్సాహంగా జరుపుకుంటున్నారు.

జిల్లా కుసుమాలు

ప్రపంచ స్థాయిలో ఆదరణ పొందిన చెస్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడకారులు సత్తా చాటుతున్నారు. అర్జున్, రాజరిత్విక్, సరయులు అంతర్జాతీయ చెస్‌లో రాణిస్తూ వర్ధమాన క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. చిన్న వయస్సులోనే గ్రాండ్ మాస్టర్లుగా అర్హత సాధించి రాష్ట్రానికి, జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకువస్తున్నారు. హనుమకొండ నగరానికి చెందిన ఇరిగేసి అర్జున్ 15 ఏళ్లకే క్లాసికల్ ఫిడే చెస్ రేటింగ్‌లో రాష్ట్రం నుంచి తొలి గ్రాండ్ మాస్టర్ (జీఎం) హోదాను సాధించాడు. ప్రపంచస్థాయి క్లాసికల్ ఫిడే చెస్ రేటింగ్ లో 4వ స్థానంలో నిలవగా, భారతదేశం నుంచి క్లాసికల్ ఫిడే రేటింగ్‌లో తొలి స్థానంలో నిలిచి చరిత్ర సృష్టించాడు. అదే విధంగా నగరానికి చెం దిన మరో అంతర్జాతీయ చెస్ దిగ్గజం రాజావరం రాజారిత్విక్.. తన తండ్రి స్వతహాగా చెస్ క్రీడాకా రుడు కావడంతో 6ఏళ్ల వయస్సులో కోచ్ బొళ్లం సంపత్‌కుమార్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ క్లాసికల్ ఫిడే చెస్ రేటింగ్‌లో 17ఏళ్ల వయస్సులోనే తెలంగాణ నుంచి రెండో గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించి చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. అలాగే మొండ్రాయి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన సరయు చిన్నతనంలోనే చెస్ క్రీడ పట్ల అసక్తి పెంచుకుంది. ఇది గమనించిన తండ్రి చెస్‌లో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించుకున్నాడు. కోచ్ బొళ్లం సంపత్ వద్ద శిక్షణ తీసుకుంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ చెస్‌పోటీల్లో పాల్గొని ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) హోదాను అంతర్జాతీయ గుర్తింపు సాధించింది. పేద కుటుంబంలో జన్మించిన సరయు ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా ఐఎం హోదాను సాధించి 3 నార్మ్‌లు చెస్‌లో పాల్గొని అత్యధిక ఫిడ్ చెస్ రేటింగ్ సాధించి గ్రాండ్ మాస్టర్ హోదా సాధించే అవకాశం దగ్గరలోని ఉంది.

క్రీడాకారులను ప్రోత్సహించాలి..

చెస్ క్రీడాకారుల్లో ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక అనుకున్న లక్ష్యాన్ని చేరలేకపోతున్నారని సీనియర్ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెస్ మేధావులను ప్రభుత్వం గుర్తించి ఆదరిస్తే మరెన్నో అద్భుతాలను సృష్టించే అవకాశం ఉందంటున్నారు. చదరంగంలో రాణించాలంటే క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. ఆదరిస్తే మరికొంత మంది క్రీడాకుసుమాలు అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉందంటున్నారు.

చాంపియన్‌షిప్ సాధించడమే లక్ష్యం

ఇరిగేసి అర్జున్, చెస్ గ్రాండ్ మాస్టర్ హనుమకొండ



25వ అబుదాబీ చెస్ ఫెస్టివల్, మాస్టర్స్ టోర్నమెంట్‌లో మూడో నార్మ్‌లో విజయం సాధించి గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించడం ఆనందంగా ఉంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్‌ల పర్యవేక్షణతోనే జీఎం హోదాను సాధించాను. ఫిడే రేటింగ్‌లో ప్రపంచ చాంపియన్‌గా ఉన్న మాగ్నస్ కార్ల్‌సన్ పై విజయం సాధించి ప్రపంచ చెస్ చాంపియన్ సాధించడమే నా లక్ష్యం.

సూపర్ గ్రాండ్ మాస్టర్ సాధిస్తా..

రాజావరం రాజారిత్విక్, చెస్ గ్రాండ్ మాస్టర్



మైండ్ గేమ్ అయిన చెస్ రాణించాలంటే ఏకాగ్రత తప్పనిసరి, 17ఏళ్ల వయస్సులో రాష్ట్రం నుంచి రెండో చెస్ గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించాను. సూపర్ గ్రాండ్ మాస్టర్‌గా నార్మ్స్ సాధించి ఫిడే చెస్ రేటింగ్‌లో అత్యుత్తమ ప్రతిభతో రాణించి ప్రపంచ చెస్ చాంపియన్‌గా విజయం సాధిస్తానని నమ్మకం ఉంది.

గ్రాండ్ మాస్టర్ సాధించడమే కర్తవ్యం

సరయు, చెస్ ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం)



జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్లలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాణించి ఫిడే చెస్ రేటింగ్ ఆధారంగా వివిధ హోదాలు అందిపుచ్చుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే క్యాండిడేట్ మాస్టర్ (సీఎం) ఫిడే మాస్టర్ (ఎఫ్ఎం) ఇంటర్నేషినల్ మాస్టర్ (ఐఎం) హోదాను సాధించాను. దీంతో పాటుగా మూడు నార్మ్‌లు వివిధ దేశాల ప్రత్యర్థులతో పాల్గొని ఫిడే చెస్ రేటింగ్ సాధించి గ్రాండ్ మాస్టర్‌గా రాణించాలనేదే నా కర్తవ్యం.

ఇద్దరు గ్రాండ్ మాస్టర్లుగా ఎదగడం గర్వకారణం

బాసిరి వెంకట రాజ్‌గోపాల్, వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు



ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన ఇరిగేసి అర్జున్, రాజవరం రాజారిత్విక్‌లు చిన్న వయస్సులోనే చెస్‌లో గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించడం గర్వకారణం. చిన్నప్పటి నుంచి చెస్ క్రీడ పట్ల పట్టుదలతో సాధనం చేయడం ద్వారానే వారు అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూలై 19: గంజాయిలాంటి మత్తు పదార్థాల నియంత్రణకు వరంగల్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శుక్రవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అంబర్ కిషోర్ ఝా మాట్లాడారు. కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణకు డ్రగ్ కంట్రోల్ టీంను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీం కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల విక్రయాలపై, మత్తుపదార్థాలు సేవించే వారిపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక పోలీసులతో కలిసి ప్రత్యేక టీం పనిచేస్తుందన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కళాశాలల్లో, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. డ్రగ్స్ కిట్‌లతో నిరంతరం రోడ్లపై తనిఖీలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే నగరంలో డీ ఎడిక్షన్ సెంటర్ సైతం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కమిషనరేట్ పరిధిలో పూర్తి స్థాయిలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ముందుకు వెలుతున్నట్లు అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

కౌన్సెలింగ్‌కు వెళ్లిన నర్సింగ్ ఆఫీసర్లు

ఎంజీఎంలో ఇబ్బందులు పడుతున్న రోగులు

వరంగల్ మెడికల్, జూలై 19: రాష్ట్ర ఆరోగ్యశాఖ సంచాలకుల కార్యాలయ నిర్లక్ష్యం వల్ల నర్సింగ్ ఆఫీసర్ల కౌన్సెలింగ్ రసాభాసగా మారింది. శుక్రవారం ఉదయం 8 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పడంతో ఎంజీఎం నుంచి 200లకు పైగా నర్సింగ్ ఆఫీసర్లు గురువారం రాత్రి నుంచే సెలవులు పెట్టి హైదరాబాద్‌కు వెళ్లారు. తీరా అక్కడకు వెళ్లాకా మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ అని ప్రకటించారు. అప్పటికే తప్పుల తడకగా ఉన్న లిస్టుతో కౌన్సెలింగ్ చేసేందుకు అధికారులు ప్రయత్నించగా నర్సింగ్ ఆఫీసర్లు అడ్డుకున్నారు. కౌన్సెలింగ్ ముందు వేకెన్సీ లిస్టును, స్పౌజ్, వికలాంగులు తదితర ప్రాధాన్యక్రమంకు సంబంధించిన జాబితాలు ప్రకటించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ కౌన్సెలింగ్‌కు అడ్డుతగిలారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు కూడా కౌన్సెలింగ్ జరుగుతుందా లేదా అనే అయోమయంలో ఉన్నారు. దీంతో ఎంజీఎంలో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శిక్షణ పొందుతున్న నర్సింగ్ విద్యార్థులతో సేవలను అధికారులు నెట్టుకు వస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఎంజీఎం రోగులకు శాపంగా మారింది.

వంగపహాడ్‌లో త్వరలో పోలీసు ఔట్‌పోస్ట్

అడ్డుకునేందుకు కొందరి ప్రయత్నాలు

వరంగల్ క్రైం, జూలై 19: హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంగపహాడ్ గ్రామ ప్రారంభంలో పోలీసు ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయనున్నారు. గతంలో ఈ ప్రాంతంలో 2010 నుంచి 2015 వరకు ఔట్‌పోస్ట్ ఉండేది. తర్వాత ఔట్‌పోస్ట్ ఎత్తేశారు. ఓఆర్‌ఆర్‌పై అసాంఘిక కార్యకలాపాలు సాగుతుండటం, మత్తు పదార్థాల విక్రయాలు, అక్రమదందాలు సాగుతుండటంతో ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలనే ఆలోచన పోలీసులు చేస్తున్నట్లు సమాచారం. ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారం సాగుతుండటంతో దందాలు చేసేవారు స్థానిక పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయకుండా ముందస్తు ప్రయత్నాలు సాగిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేస్తే దందాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో పోలీసులతో బేరసారాలు చేస్తున్నారని తెలిసింది. కొందరు పోలీసులు సైతం ఒక బేరం కుదుర్చుకుని ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయకుండా చూస్తామని భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఔట్‌పోస్ట్ ఏర్పాటుపై కాజీపేట ఏసీపీని వివరణ కోరే ప్రయత్నం చేయగా స్పందించలేదు.

26 నుంచి కేయూ బీటెక్ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూలై 19: కాకతీయ యూనివర్సిటీ జూలై 26 నుంచి ఇంజనీరింగ్ (బీటెక్) రెండో, మూడో సెమిస్టర్ నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహ చారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బి.నాగరాజు శుక్రవారం ప్రకటించారు. జూలై 26, 30, ఆగస్టు 1, 3, 5వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయం త్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. రెండు, మూడో సెమిస్టర్లకు చెందిన రెగ్యులర్, సప్లిమెంటరీ, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని కోఎడ్యుకేషన్, మహిళ ఇంజనీరింగ్ కళాశాల, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల, మంచి ర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఆటోడ్రైవర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వడ్డేపల్లి, జూలై 19: ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్ల నిధులను కేటాయించాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇమ్మడిశెట్టి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు ఆరు లక్షల మంది ఆటోడ్రైవర్లు ఉన్నారని, వీరి సంక్షేమం కోసం ఆటో డ్రైవర్ బీమా పథకాన్ని రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పినప్పటికీ ఏడునెలలు కావొస్తున్నా కార్యరూపం దాల్చలేదని ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ఆటోడ్రైవర్ల ఆదాయానికి గండి పడిందని పేర్కొన్నారు. వేలాది మంది ఆటోడ్రైవర్లు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఆటో డ్రైవర్‌కు ఏటా రూ.25వేలు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శనివారం బాలసముద్రంలోని ఏకశిల పార్కులో నిర్వహించే ధర్నాలో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఇమ్మడిశెట్టి రాజు కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ నేతలు గౌని రాజు, ఆవుల నవీన్‌కుమార్, మస్కే కరుణాకర్, అక్కునపెల్లి అంజయ్య, గోపనబోయిన రాజు, బరిగెల కృష్ణమూర్తి, ఆమంచ ప్రశాంత్, బండారి శ్రీకాంత్, ఆకుల వెంకటేష్, పత్తి నర్సయ్య, తాళ్ల అంజి, వస్కుల రాజ్‌కుమార్, గడ్డం కిరణ్, తప్పెట పరశురాములు, కొట్టె జోసఫ్ పాల్గొన్నారు.

పనితీరును మెరుగుపరుచుకోవాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి



హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న సీఎండీ

హనుమకొండ టౌన్, జూలై 19: పనితీరును మరింత మెరుగుపరుచుకొని వినియోగదారులకు అంతరాయాల్లేని విద్యుత్ సరఫరాను అందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి సూచించారు. డిస్కమ్ పరిధిలో ఉద్యోగుల ప్రతిభ ఆధారంగా నెలవారీగా అందించే జ్ఞాపికలు, ప్రశంసాపత్రాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన మేనెల జ్ఞాపికలను సీఎండీ ఉద్యోగులకు అందజేశారు.

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ప్రశంసలు అందుకున్న ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకొని ఇతర ఉద్యోగులు విధి నిర్వహణలో రాణించాలన్నారు. ప్రశంసాపత్రాలు అందుకున్న ఇంజనీర్లకు ఈ సందర్భంగా సీఎండీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో డిస్కమ్ పరిధిలో హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, ఉమ్మడి వరంగల్ ఏడీఈ విభాగంలో హనుమకొండ టౌన్ ఏడీఈ మల్లిఖార్జున్, ఏఈ విభాగంలో యం.ప్రవీణ్ - నక్కలగుట్ట, ఏఈ రమేశ్ - దామెర, నవీన్‌కుమార్ - సుబేదారి, బి.పద్మ - హనుమకొండ రూరల్ డివిజన్, ఐనవోలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ టి.మధుసూదన్, సీజీఎం కిషన్, హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ, హనుమకొండ రూరల్ డివిజన్ డీఈ బి. సామ్యానాయక్, ఏడీఈ పరకాల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

భరత్ ఉద్యమ స్ఫూర్తితో అనేక పోరాటాలు

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క ● ఎంచగూడెంలో సంస్మరణ సభ



స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న విమలక్క, భరత్ కుటుంబసభ్యులు

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), జూలై 19 : జనశక్తి నేత భరత్ తన ఉద్యమంలో చూపిన తెగువతోనే గోదావరిలోయ విప్లవోద్యమంలో అనేక పోరాటాలు జరిగాయని అరుణోదయ సాంస్కృతిక సమైఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెంలో జనశక్తి నేత భరత్ 24వ సంస్మరణ సభను భరత్ కుమారులు కృష్ణ, శ్రీను, కుటంబసభ్యులు, బంధుమిత్రులు శుక్రవారం నిర్వహిం చారు. ముందుగా భరత్ కుమారులు, కుటుంబసభ్యులు, అభిమానులతో కలిసి భరత్ స్తూపం వద్ద నివాళులు విమలక్క అర్పించారు. అనంతరం నిర్వహించిన సంస్మరణ సభలో ఆమె మాట్లాడుతూ తాను అజ్ఞాతంలో పనిచేయలేదని కాని విప్లవాన్ని, అమరత్వాన్ని తన పాటలతో ప్రజల్లోకి తీసుకెళ్లానని పేర్కొన్నారు. విప్లవోద్యమ చరిత్రలో భరత్ పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. నేడు విప్లవోద్యం చీలికలై బలహీనపడుతుందన్నారు. ఉద్యమాలకు తీరని నష్టం జరుగుతుందని ఆవేదన చెందారు. విప్లవకారులు, ప్రజలు బాధపడుతున్నారన్నారు. చీలికలను ఆసరగా చేసుకుని పెట్టుబడి దారులు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. పలువురు ఉద్యమకారులు భరత్‌తో ఉన్న తమ అనుభవాలను, నాటి పోరాటలను గుర్తు తెచ్చుకున్నారు. కాగా, విమలక్క, పుష్పక్క, యోచన పాడిన పాటలు ఉత్తేజపరిచాయి, మరికొన్ని కన్నీళ్లు పెట్టించాయి. సభలో మంత్రి సీతక్క కుమారుడు సూర్య, మాజీ జనశక్తి రాజన్న, విష్ణుమూర్తి, జగ్గన్న, సత్తెన్న, రవీందర్, విజయక్క, నాగన్న, ఎన్డీ నాయకులు గౌని అయిలయ్య, శ్రీశైలం, భరత్ బంధువులు బండి పెద్దకుమార్, బండి కుమారస్వామి, జిట్టబోయిన యాకయ్య, సుంకరబోయిన మొగిలి, రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

ఆర్డీఎస్డీఈ ట్రైనింగ్ ఆఫీసర్ విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఎస్‌టీఈ ఆఫీసర్ విజయ్‌కుమార్

కేయూ క్యాంపస్, జూలై 19: వృత్తి విద్యా కోర్సులు చదువుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని హైదరాబాద్‌లోని రీజికల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఇంటప్రెన్యూర్‌షిప్ ఆఫీసర్ కె.విజయ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం హనుమకొండ వృత్తి విద్యా కళాశాలల ఆవరణలో విద్యార్థులకు అప్రెంటిషిప్ మేళా-2024 నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బెడదం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విజయ్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఇంటర్ ఒకేషనల్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. కేంద్ర టెక్నికల్ సంస్థ శిక్షణ సంస్థ ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.7వేలు ఉపకార వేతనంగా శిక్షణ సమయంలో చెల్లిస్తుందని చెప్పారు. విశిష్ట అతిథిగా హాజరైన స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఒకేషనల్ ఎడ్యుకేషనల్ రీడర్ బి.రమేశ్ మాట్లాడుతూ.. అభ్యర్థులు ప్రభుత్వ ప్రైవేట్‌రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ), జాబ్‌మేళా కన్వీనర్ ఎ.గోపాల్ మాట్లాడుతూ.. ఇంటర్ స్థాయిలో ఇలాంటి జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందడంపై హర్షం వ్యక్తం చేశారు. ఒకేషనల్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అప్రెంటిషిప్ మేళా కోకన్వీనర్ కె. మాధవరావు, జనగామ నోడల్ ఇంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శాగంటి శ్రీనివాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ పి.దివాకర్, డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, జాబ్‌మేళాకు అభ్యర్థులు విశేషంగా హాజరయ్యారు. రిజిస్ట్రేషన్లు చేసుకుని ఉద్యోగాలు పొందారు.



ఘటన స్థలంలో భవాని, దినేష్

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

ఆత్మకూరు, జూలై 19: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో వివాహిత మృతిచెందగా, భర్త, కుమారుడు తీవ్రగాయాల పాలైన సంఘటన శుక్రవారం మండలంలోని గూడెప్పాడ్ క్రాస్‌వద్ద జరిగింది. లారీ శరీరం మీది నుంచి పోవడంతో ఛిద్రమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడెప్పాడ్‌కు చెందిన బలభద్ర దినేష్ - భవాని(23) దంపతులకు కుమారుడు ప్రద్యుమన్ ఉన్నారు. వీరు వరంగల్‌లో మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం వరంగల్‌కు వెళ్లిన వీరు.. మధ్యాహ్నం వరంగల్ నుంచి గూడెప్పాడ్‌కు కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి పరకాలకు వస్తున్న లారీ.. ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ క్రాస్ వద్ద ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న భవాని, దినేష్‌తో పాటు రెండేళ్ల బాలుడు ఎగిరి పడ్డారు. భవానిపై లారీ ముందు టైరు వెళ్లడంతో పొట్టపగిలి తీవ్ర గాయాలయ్యాయి. ఆత్మకూరు సీఐ సంతోష్ కుమార్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ భవాని మృతి చెందినట్లు సీఐ తెలిపారు. భర్త దినేష్, కుమారుడు ప్రద్యుమన్‌లు చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, లారీని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



వానమబ్బుల వేళ.. పుడమి పచ్చందాల కళ..

ఓ వైపు వానమబ్బులు.. మరోవైపు పచ్చని అందాలను పరుచుకున్న పుడమి. ఆ అపురూప దృశ్యాల కలయిక ఎంతో చూడముచ్చటగా ఉంటుంది కదూ. గుట్టల మాటు నుంచి పొగమంచు తెరల్లా కనిపిస్తున్న ఆ చిరుజల్లుల సవ్వడిలోనే రైతులు, కూలీలు పొలం పనుల్లో నిమగ్నమైన దృశ్యాలు కనులవిందు చేశాయి. ఈ ప్రకృతి రమణీయ దృశ్యం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లైన్ తండా వద్ద శుక్రవారం కనిపించింది.

- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

గుండెపోటుతో యువ రైతు మృతి

● మూడు నెలల క్రితమే పెళ్లి ● ఆషాడంతో పుట్టింటికి వెళ్లిన భార్య


సైదులు (ఫైల్)

బయ్యారం, జూలై 19 : గుండెపోటుతో రైతు గుగులోత్ సైదులు (32) మృతి చెందిన ఘటన శుక్రవారం వెంకట్రాంపురం పంచాయతీ సంగ్యాతండాలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. సంగ్యాతండాకు చెందిన గుగులోత్ రాంచంద్రు, సోనీలకు ముగ్గురు సంతానం. కుమారుడు సైదులుతో పాటు ఇరువురు కూతుళ్లు భారతి, సంతోషలున్నారు. ఇది వరకే రాంచంద్రు ఇరువురు కూతుళ్లకు పెళ్లిళ్ల కాగా. ఈ ఏడాది ఏప్రిల్ 21న కుమారుడు సైదులుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం దంతాలబారు గ్రామానికి చెందిన కళావతితో వివాహమైంది. హిందూ ఆచారసంప్రదాయ ప్రకారం సైదులు భార్య కళావతి ఇటీవల ఆషాడమాసంలో పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో సాగు పనుల్లో నిమగ్నమైన సైదులుకు బుధవారం జ్వరం రాగా, ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. రక్త పరీక్షలు నిర్వహిస్తే కూడా అన్ని నార్మల్‌గా వచ్చినట్లు తెలిసింది. గురువారం రాత్రి భోజనం చేసిన తరువాత నిద్రించే సమయంలో చాతిలో నొప్పి వచ్చి ఆయాసపడటంతో సైదులు కాసేపు ఇంట్లోనే అటు ఇటు తిరిగినట్లు సమాచారం. అనంతరం ఏమైందో ఏమో తెలియదు కాని తెల్లవారుజామున కుటుంబ సభ్యులు లేచి చూసే సరికి సైదులు విగతజీవిగా పడివున్నాడు. కుటుంబసభ్యులు, ఇరుగుపొరుగు వారు సైదులును చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లినప్పటికి ఫలితం లేకపోయింది. అక్కడ పరీక్షించిన వైద్యులు సైదులు ఆస్పత్రికి వచ్చేలోపే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు తెలిసింది. దీంతో సైదులు గుండెపోటుకు గురై మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. వివాహమై మూడు మాసాలు కూడా పూర్తిగా గడవకముందే సైదులు అకాల మరణం గావించడంతో సంగ్యాతండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

నర్సింహులపేట, జూలై 19 : కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది, ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన పాండ్యాతండాలో శుక్రవారం జరిగింది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. పాండ్యాతండాకు చెందిన గుగులోతు సుదర్శన్ (34) కుటుంబంపై విరక్తిచెంది కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఉన్న సుదర్శన్ భార్యతో ఘర్షణపడి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి కొమిటి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నారు.

ఇద్దరు గంజాయి నిందితుల అరెస్టు

మహబూబాబాద్ రూరల్, జూలై 19 : జిల్లా కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కన్పించిన ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 1.400 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ దేవేందర్ శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. వీఎస్ఆర్ గార్డెన్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కవర్ చేతులో పట్టుకుని వస్తున్న ఇద్దరు అనుమానితులైన ఒడిస్సా రాష్ట్రం కొరపుట్టు జిల్లా, మండలం బడిగాడ గ్రామానికి చెందిన బలబద్రఖర, మహబూబాబాద్ జిల్లా కేంద్రం హరిజనవాడకు చెందిన కారపాటి వాసులను తనిఖీ చేయగా, వారి వద్ద గంజాయి లభించినట్లు చెప్పారు. ఒడిస్సా నుంచి తీసుకువచ్చిన గంజాయిని మహబూబాబాద్‌లో విక్రయించేందుకు తీసుకువెళ్తున్న క్రమంలో వారిని అదుపులోకి తీసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో టౌన్ ఎస్సై విజయ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భీమునిపాదంలో పర్యాటకుల సందడి



గూడూరు, జూలై 19 : సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీ ప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతం పర్యాటకులతో శుక్రవారం సందడిగా మారింది. గత మూడ్రోజులుగా కురుస్తున్న మోస్తారు వర్షాలకు భీమునిపాదం జలపాతం వాటర్‌ఫాల్స్ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. 70 పీట్ల ఎత్తు నుంచి జాలువారుతున్న వాటర్ ఫాల్స్‌ను చూసి మైమరిచిపోతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ బాబురావు, ఎస్సై నగేష్, అటవీశాఖ రేంజ్ అధికారి సురేష్‌లు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

సామాజిక ఉద్యమకారుడు కిషన్‌నాయక్‌కు సన్మానం

మహబూబాబాద్ టౌన్, జూలై 19 : పట్టణంలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీడబ్ల్యూజేఏ) ఆధ్వర్యంలో సామాజిక ఉద్యమకారుడు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు గుగులోతు కిషన్‌నాయక్‌ను శుక్రవారం సన్మానించారు. ఇటీవల పదవీ విరమణ పొందిన కిషన్‌నాయక్‌ను శాలువాలతో సత్కరించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూనే సామాజిక సేవలు కొనసాగించిన కిషన్‌నాయక్ అందరికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లావుడ్యా రాము నాయక్, రవి, బాలు, హనుమాన్ నాయక్ పాల్గొన్నారు.

యూరియా కొరతను తీర్చాలి

ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వ్యాపారుల విజ్ఞప్తి


మురళీనాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జిల్లా ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ సీడ్స్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 19 : జిల్లాలో యూరియా సరఫరా కొరత వల్ల డీలర్లు కష్టాల పాలవుతున్నారని జిల్లా ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ సీడ్స్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ డీలర్లకు యూరియా కొనుగోలు చేసే సమయంలోనే ట్రాన్స్‌పోర్టు చార్జీలు అదనపు భారం పడడమే కాకుండా యూరియా తీసుకుంటేనే లింకు పెట్టి ఇతర ఉత్పత్తులను డీలర్లకు అంటగడుతున్నారని, దాంతో డీలర్లకు అదనపు భారం పడాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని సొసైటీలకు మాత్రం ట్రాన్స్‌పోర్టు చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందని, అలాగే యూరియాకు ఎలాంటి లింకు లేకుండా ఇస్తున్నారని వారు ఆరోపించారు. వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడి డీలర్లపై అదనపు భారం పడకుండా యూరియాను సరఫరా చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువా కప్పి సన్మానించారు. జిల్లా కన్వీనర్ ఓలం రమేష్, కో కన్వీనర్ వేమిశెట్టి సోమయ్య, పాండురంగం, ఓలం వీరభద్రం, చంద్రయ్య, వెంకన్న, వీరన్న, కోయగురి యాకూబ్‌రెడ్డి, వక్కల శ్రీను, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

● మహబూబాబాద్ టౌన్ : ఇందిరా కాంతి పథం (ఐకేపీ) విలేజ్ ఆర్గనేజేషన్ అసిస్టెంట్ (వీవోఏ)లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐకేపీ వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు నీలం కృష్ణవేణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరికుంట్ల నాగన్న విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ పట్టణంలో ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్‌కువినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ధరల కనుగుణంగా ఐకేపీ వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. జీవో నెంబరు 58ని సవరించి, వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.10లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, అర్హులైన వీవోఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వెలిశాల సుధాకర్, పవన్, లలిత, కవిత, శోభ, వీరన్న, రాణి, మంజుల, సుధాకర్, శ్రీలత, వెంకటలక్ష్మి, రాజు, మల్లేష్, కల్యాణ్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మహబూబాబాద్ టౌన్ : పట్టణంలో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మృతుల కుటుంబాలను పరామర్శించారు. మునిసిపల్ 34వవార్డు పరిధిలోని నెహ్రూసెంటర్‌లో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గొంగళ్ల వెంకటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. 26వవార్డు పరిధిలోని సిగ్నల్ కాలనీలో గాడిపెల్లి ఎల్లయ్య కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా 50 కేజీల బియ్యాన్ని అందించారు. అనంతరం సిగ్నల్ కాలనీలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించిన పునగంటి రాము కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుటి సురేష్‌నాయుడు, ఎడ్ల రమేష్, బండి వెంకన్న, బట్టు దేవ్‌సింగ్, నిమ్మల శ్రీనివాస్, సల్వాది దిలీప్, పింద్రాల రాందాస్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు


లింగ్యాతండాలో బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎస్సై గోపి

డోర్నకల్, జూలై 19 : మండలంలోని హన్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని తండాల్లో శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. హన్యతండాకు చెందిన రాందాసు, బింగిలు అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో వారి వద్ద నుంచి 8 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని వారిరువురిపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్సై తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

● సీరోలు : రేకులతండాలో గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎస్సై విజయ్‌రాంకుమార్, పోలీసులు మహిపాల్ పాల్గొన్నారు.

● కొత్తగూడ : బోరింగ్ తండాలో గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 12 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. 60 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. భూక్య రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.

● కురవి : ప్రాణహాని కలిగించే గుడుంబాను తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గోపి అన్నారు. లింగ్యాతండా (బీ)లో బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఏడుగురి ఇళ్లలో బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకుని పారబోశారు. హెడ్ కానిస్టేబుల్ ఉపేందర్‌రావు, పీసీలు కాశీరాం, రమేష్, హరిబాబు, అనిత, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

● గూడూరు :గుడుంబా విక్రయించిన, కాచీన వారిపై పీడీయాక్టు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సీహెచ్.నగేష్ హెచ్చరించారు. గూడూరు మండలం చిన్న ఎల్లాపురం, కారంపొడితండాల్లో పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇందుకు బాధ్యులైన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

మహబూబాబాద్ రూరల్, జూలై 19 : ఇల్లందు పట్టణంలో ఈనెల 21న జరిగే తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటర్ వర్కర్స్ ఫెడరేషన్ 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఫెడరేషన్ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి యాకాంబ్రం పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పట్టణంలోని ఫారెస్టు సెంటర్ వద్ద ఫెడరేషన్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మోటారు రంగంలో పనిచేస్తున్న కార్మికులు, డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై పలు తీర్మాణాలు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి డ్రైవర్లు, కార్మికులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేణు, వెంకన్న, లింగమూర్తి, వీరన్న పాల్గొన్నారు.

ముత్యాలమ్మతండాలో వైద్యశిబిరం

కేసముద్రం, జూలై 19 : మహమూద్‌పట్నం శివారు తౌర్యతండ జీపీ పరిధిలోని ముత్యాలమ్మతండాలో శుక్రవారం ఇనుగుర్తి పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తండాలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ ఉన్ననీటిలో దోమలు పెరుగుతాయని వైద్యసిబ్బంది అవగాహన కల్పిస్తూ నీటిని తొలగింపజేశారు. జ్వర పీడితుల కోసం సర్వే నిర్వహించి రక్త నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సురేష్, ప్రత్యూష, కృష్ణకుమారి, యాకమ్మ, సునిత పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

గూడూరు, జూలై 19 : మచ్చర్ల ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు నలమాస వెంకన్న, ఎండి.యాకూబ్, పి.జ్యోతిలను పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం సత్కరించారు. ప్రతీ ఉపాధ్యాయుడికి బదిలీలు సహజమేనని, ఎక్కడ విధులు నిర్వహించిన విద్యార్థుల అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులు రామయ్య, జగ్గయ్య, వెంకటేశ్వర్లు అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాదుల శ్రీనివాస్

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి : సీపీఎం

మహబూబాబాద్ టౌన్, జూలై 19 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం కుమ్మరికుంట్ల నాగన్న అధ్యక్షతనశాఖ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, మునిసిపల్‌ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య, నాయకులు సమ్మెట రాజమౌళి, బానోత్ సీతారాంనాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రావుల రాజు, యాకయ్య పాల్గొన్నారు.

'టీచర్ల సేవలు అభినందనీయం'

తొర్రూరు, జూలై 19 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల అభివృద్ధి కోసం పనిచేసే ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని ఎంపీడీవో సిలార్ సాహెబ్, ప్రధానోపాధ్యాయురాలు విమలాదేవి అన్నారు. శుక్రవారం పోలెపల్లిలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను గ్రామస్థులు, పాఠశాల సత్కరించారు. ఉపాధ్యాయులు స్వాతి, కర్ణాకర్, శ్రీనివాస్, అంకుష్, సుధాకర్, అంజయ్య వినోద్, రాజు, శేఖర్ పాల్గొన్నారు.


మూడుకొట్ల సెంటర్‌లో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న టౌన్ ఎస్సై అరుణ

'గంజాయి, గుట్కా అక్రమ రవాణాపై ఉక్కుపాదం'

మహబూబాబాద్ రూరల్, జూలై19 : జిల్లాలో గంజాయి, గుట్కా అక్రమ రవాణా, డ్రంక్అండ్‌డ్రైవ్‌పై ఉక్కుపాదం మోపామని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. వ్యాప్తంగా శుక్రవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు, డ్రంక్అండ్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపి ఇతరు మరణాలకు కారకులకు కాకూడదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పెండింగ్ చలాన్లు చెల్లించాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. యువత మద్యం సేవించి వాహనాలు నడుపవద్ద హెచ్చరించారు.

మానవత్వం చాటుకున్న సబ్‌జైలర్

మహబూబాబాద్ రూరల్, జూలై 19 : దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్లకు చెందిన మానసిక దివ్యాంగుడు తండ సత్తయ్య గత ఏడాది భార్యను హత్య చేశాడు. దీంతో ఆయన జైలుశిక్ష అనుభవిస్తున్నాడు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్ శుక్రవారం సత్తయ్యను నిర్ధోషిగా తీర్పునిచ్చారు. ఈ సమాచారం సత్తయ్య కుటుంబసభ్యులకు తెలపడంతో అతన్ని తీసుకు వెళ్తేందుకు ఎవరూ రాలేదు. దీంతో మహబూబాబాద్ సబ్‌జైలర్ మల్లెల శ్రీనివాస రావు ఫోన్‌ద్వారా సత్తయ్య కుమారులకు కౌన్సిలింగ్ నిర్వహించి, సొంత ఖర్చుల ద్వారా కాని స్టేబుల్‌ను ఇచ్చి సత్తయ్యను కుమ్మరికుంట్ల గ్రామానికి పంపించి మానవత్వం చాటుకున్నారు. దీంతో సబ్‌జైలర్ మల్లెల శ్రీనివాస్ రావును పలువురు అభినందించారు.

'రైతు సంక్షేమానికి పెద్దపీట'

మహబూబాబాద్ రూరల్, జూలై 19 : రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వీఎస్.లక్ష్మీపురం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మీసాల వెంకన్న అన్నారు. మహబూబాబాద్ మండలం వీఎస్.లక్ష్మీపురంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలో ఇచ్చిన మాట ప్రకారం. రైతు రుణమాఫీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కొండ నర్సయ్య, యాదగిరి, లింగన్న, పాపయ్య సత్యనారాయణ, సురేష్, భిక్షపతి, శ్రీనివాస్, నరేష్, ఆనంద్, ప్రదీప్, కృష్ణ, రామస్వామి, సారయ్య పాల్గొన్నారు.

మంగళ్‌పాండే గురించి భావితరాలకు తెలుపాలి

● నేతాజీ సేవాసమితి వ్యవస్థాపకుడు నాగరాజు

మహబూబాబాద్ టౌన్, జూలై 19 : బ్రిటీష్ వారిని గడగడలాడించిన స్వాతంత్ర్య సమరయోధులు మంగళ్‌పాండే పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నేతాజీసేవాసమితి వ్యవస్థాపకులు డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు మంగళ్‌పాండే జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. 19 జూలై 2024న స్థాపించబడిన నేతాజీ సేవాసమితి ఆధ్వర్యంలో మహనీయుల జయంతి, వర్ధంతులను నిర్వహిస్తూ వారి పోరాటాలను నెమరవేసుకుంటూ చరిత్రను భావితరాలకు అందిస్తున్నామని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్ పాలకుల గుండెల్లో తూటాలు దించి పరాయిపాలన వద్దు.. స్వపరిపాలన ముద్దు అంటూ ఉరి కంభాన్ని ముద్దాడిన యోధుడు మంగళ్‌పాండే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమితి నిర్వహణ కార్యదర్శి కుదురుపాక వివేక్, బోనగిరి లక్ష్మీనారాయణ, రాణాశంకర్, కుంట రజిత, చిట్టిమల్ల రఘు, శోభన్‌బాబు, ప్రవీణ్, రవి పాల్గొన్నారు.

'బీసీ కులగణనను చేయాలి'

మరిపెడ రూరల్, జూలై 19 : బీసీ కుల గణనను తక్షణమే నిర్వహించి, రిజర్వేషన్లను పెంచాలని గోపా సంఘం మండల ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గుండెపుడిలో మాట్లాడారు. ఇప్పటికే విధి విధానాలను రూపొందించి మార్గదర్శకాలు విడుదల చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం శుభపరిమాణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుల గణన చేపట్టడానికి తెలంగాణ రాష్ట్రం ఒకటి, రెండు నెలల్లోనే మొత్తం గణాంకాలను సేకరించడానికి అవకాశం ఉందన్నారు.

'సమాజ సేవలో భాగస్వాములు కావాలి'

పెద్దవంగర, జూలై 19 : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమవంతు సహకారం అందించాలని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ తమ్మెర లక్ష్మీనరసింహారావు అన్నారు. శుక్రవారం చిట్యాల ప్రాథమిక పాఠశాలలో మాజీ గవర్నర్ తమ్మెర లక్ష్మీనరసింహారావు జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా తరుణి అధ్యక్షురాలు మాధవపెద్ది వాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, తదితర సామగ్రిని అందజేశారు.ఎస్‌డబ్ల్యూసీ జిల్లా కోఆర్డినేటర్ వేలూరు శారద, రేవూరి శ్రీదేవి, రాధిక, హెచ్‌ఎం రమేష్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ మృతి తీరని లోటు

మరిపెడ, జూలై 19 : సీపీఐఎంఎల్ ప్రజాపంథా కేంద్ర కమిటీ నాయకుడు రాయల చంద్రశేఖర్‌రావు అకాల మృతి తీరనిలోటని ఆ పార్టీ మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. శుక్రవారం ఆ పార్టీ కార్యకర్తలు మరిపెడ మునిసిపల్ కేంద్రంలో చంద్రశేఖర్‌రావు మృతి పట్ల నివాళులర్పించారు. నాయకులు ముంజంపల్లి వీరన్న, బండపల్లి వెంకటేశ్వర్లు, భిక్షం, వెంకన్న, వీరన్న, రవి, బావుసింగ్, సురేందర్, శంకర్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు ఘన సన్మానం


కేసముద్రం, జూలై 19 : మండలంలోని పెనుగొండ శివారు నర్సింహులగూడెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కొడిపాక రమేష్ బదిలీపై వెళుతుండడంతో శుక్రవారం ఆయన్ను హెచ్‌ఎం ఎన్నం భాస్కర్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురుమాట్లాడుతూ రమేష్ పనిచేసిన కాలంలో సామాజిక కార్యక్రమాలు చేయడం చేశారని తెలిపారు. ప్రధానమంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమంలో రమేష్ ప్రస్తావన రావడం, ప్రసారభారతి ఆహ్వానం మేరకు ఆయన గణతంత్ర వేడుకలకు సైతం హాజరైనట్లు తెలిపారు. హెచ్‌ఎం యాదగిరి, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.


పినిరెడ్డిగూడెంలో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

యాజమాన్య పద్ధతులు పాటించాలి : ఏవో

గార్ల జూలై 19 : గ్రామీణ ప్రాంతాల్లో పత్తి పంటలు సాగుచేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి, అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖాధికారి కావటి రామారావు సూచించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పినిరెడ్డిగూడెంలో దెబ్బతిన్న పత్తి పంటల్లో శుక్రవారం క్షేత్ర సందర్శన శాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా పత్తిపంటల్లో కలుపు ఎక్కువ వస్తుందని విటిని సకాలంలో తొలగిస్తే పంట ఏపుగా పెరగడానికి దోహద పడుతుందన్నారు. ఏఈవో ప్రశాంత్, రైతులు ఇందుర్తి వెంకట్ రెడ్డి, మల్లేశ్, ఎల్లయ్య, పోలంపల్లి భిక్షపతి పాల్గొన్నారు.

వానొస్తే.. నడవలేని దుస్థితి


బురదతో ఉన్నసెయింట్ ఆగస్టీన్ స్కూల్‌కు వెళ్లే రోడ్డు

మరిపెడ, జూలై 19 : మరిపెడ మునిసిపల్ పరిధిలోని కొన్ని కాలనీలలో వానొస్తే పిల్లలు, వృద్ధులు నడవలేని దుస్థితి నెలకొంది. గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. శుక్రవారం మరిపెడ సెయింట్ ఆగస్టీన్ స్కూల్‌కు వెళ్లే రహదారి పొలం కరిగట్లను తలపిస్తుంది. కాలు తీసి కాలు జరపనివ్వని వైనం అక్కడ నెలకొంది. ఈ స్కూల్‌కు నిత్యం 1200 మంది విద్యార్థులు విద్యార్జన కోసం వస్తారు. ఆ రోడ్డుపై విద్యార్థుల అగచాట్లు చూడతరం కానివని, ఈ రోడ్డు దుస్థితిపై స్థానికులు సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేయగా మునిసిపల్ అధికారుల తీరుపై జనం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఆ రోడ్డుకు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని పాఠశాల పిల్లలు, వారి తల్లితండ్రులు అధికారులను వేడుకుంటున్నారు.

'సేవ చేయడం అభినందనీయం'

తొర్రూరు, జూలై 19 : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమాజంలో పేదలకు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సేవ చేయడం అభినందనీయమని లయన్స్ క్లబ్ పూర్వపు జిల్లా గవర్నర్ తమ్మెర లక్ష్మీనర్సింహారావు అన్నారు. శుక్రవారం మండలంలోని అమ్మాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యారులకు రూ.15వేల విలువ గల నోట్ పుస్తకాలు, జామెట్రీ బాక్స్‌లు అందించారు. లక్ష్మీనర్సింహారావు జన్మదినం సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. లయన్స్ క్లబ్ చార్టర్డ్ ప్రెసిడెంట్ కె.రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎంతో మంది పేదలకు, అనాథలకు సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. నూతనంగా ఏర్పడిన క్లబ్ సభ్యులు మరిన్ని సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్, తమ్మి రమేష్, టి.వెంకట్ రెడ్డి, రేగూరి వెంకన్న, శారద, శ్రీదేవి, విశ్వేశ్వరరావు, కుమారస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేకల కాపరి మృతి

మరిపెడ, జూలై 19 : ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి ఓ మేకల కాపరి మృతి చెందిన ఘటన శుక్రవారం మరిపెడ విలేజీలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. మరిపెడ విలేజీకి చెందిన చీమ కేశవులు (30) మేకలను కాయడానికి వెళ్లి, వాటి మేత కోసం చెట్టుకొమ్మలను నరుకుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి కిందపడ్డాడు. దీంతో పక్కటెమకలకు బలమైన గాయమై ఆయన అక్కడికి అక్కడే మృతి చెందారు. మృతుడు కేశవులు భార్య ఆర్నెళ్ల గర్భిణి. భర్త అకాల మృతితో ఆమె బోరున విలపించారు. ఉన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎంపీడీవో

తొర్రూరు, జూలై 19 : వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సిలార్ సాహెబ్ అన్నారు. శుక్రవారం వెంకటాపురం గ్రామంలో ఫ్రైడే డ్రైడే సందర్భంగా పంచాయతీ సిబ్బంది, వైద్యశాఖ సిబ్బందితో గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ ప్రజలకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా శాఖల సిబ్బంది అధికారులు స్థానికంగా ఉండి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. స్థానికంగా ఉండని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ సెక్రెటరీ, ఎంపీవో గౌస్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.



దివ్యాంగురాలు శ్రావణిని హైదరాబాద్ చిల్డ్రన్‌హోంకు తరలిస్తున్న లయన్స్‌క్లబ్, చైల్డ్ డెవలప్‌మెంట్ కమిటీ

దివ్యాంగురాలికి లయన్స్‌క్లబ్ అపన్నహస్తం

● తల్లి మృతి, అచేతన స్థితిలో తండ్రి
● హైదరాబాద్ చిల్డ్రన్‌హోంకు తరలింపు

కురవి, జూలై 19 : మండల కేంద్రానికి చెందిన దివ్యాంగురాలైన నేలమర్రి శ్రావణి అనే 13 ఏళ్ల బాలిక సొంతంగా కూర్చోలేదు, నడవలేదు. పుట్టుకతోనే నడుము పడిపోవడంతో తల్లిదండ్రుల సహాయం లేనిదే కదలలేదు. పుట్టిన నాటి నుంచి నేటి వరకు మంచానికే పరిమితమైన శ్రావణి తల్లి ఇటీవల మృతి చెందింది. ఆమె తండ్రి ఉప్పలయ్య సైతం అనారోగ్యంతో అచేతన స్థితిలో ఉన్నాడు. దీంతో దివ్యాంగురాలైన శ్రావణి జీవితం దయనీయంగా మారి సందిగ్ధంలో పడింది. విషయం తెలుసుకున్న లయన్స్‌క్లబ్ మహబూబాబాద్ శాఖ అధ్యక్షులు యాళ్ల మురళీధర్‌రెడ్డి బాలికకు సహాయం చేయాలనే సంకల్పంతో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి దృష్టికి శ్రావణి దీనగాధను తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన నాగవాణి హైదరాబాద్ మేడ్చల్‌లోని క్రిస్టోజు చిల్డ్రన్‌హోంకు సమాచారం అందించారు. వారిద్దరు కలిసి బాలికను బాలిక సదనానికి పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం కురవి మండల కేంద్రంలోని ఆమె ఇంటి నుంచి శ్రావణిని హైదరాబాద్ తరలించేందుకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేశారు. మురళీధర్‌రెడ్డి బాలికకు నిత్యావసర వస్తువులతో పాటు దుస్తులు అందించి హైదరాబాద్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ రావుల రవిచందర్‌రెడ్డి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, సభ్యులు డేవిడ్, క్లబ్ సెక్రెటరీ చాడ అశోక్‌రెడ్డి, కోశాధికారి అనుముల సిద్ధార్థ్, క్లబ్ సభ్యులు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, నవాబ్, పారుపల్లి రమేష్, నాయిని రంజిత్, పరకాల రవీందర్‌రెడ్డి, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, రావుల ప్రదీప్‌రెడ్డి, బాలరక్షక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'నిధులు విడుదల చేయాలి'

కురవి, జూలై 19 : కేజీబీవీ పాఠశాలలకు తక్షణమే నిధులు విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.యాకూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేరడ, తట్టుపల్లి, కురవి పాఠశాలల్లో శుక్రవారం టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్, బాలరాజు, అస్మత్‌పాషా పాల్గొన్నారు.